# సింగిల్ పేజీ కథలు

## వైకల్యం

ఆకువచ్చ అంచున్న కనకాంబరం రంగు పట్టుచీర, తలలో కనకాంబరాలు, మరువం, సన్నజాజులు కలిపి కట్టిన కదంబమాల, చేతుల నిండుగా నారింజరంగు గాజులు, చెవు లకి జూంకాలు, పచ్చని పాదాల మీద అందంగా మెరుస్తున్న మామిడి పిందెల పట్టీలు ఇవన్నీ ఒక ఎత్తైతే, మానస సరోవ రంలో తెల్లకలువలా నిర్మలంగా స్వచ్ఛంగా వున్న కళ్ళ అందంతో తొణికిసలాడుతున్న ఆత్మవిశ్వాసం, మాటల్లో తెలివి తేటలు చంద్రశేఖర్, పార్వతిని ఎంతో ఆకట్టుకున్నాయి.

'అమ్మాయి మహాలక్ష్మిలావుంది. అబ్బాయికి సరియైన జోడి' అని యిద్దరూ ఒకేసారి మనసులో అనుకున్నారు.

భార్యవైపు చూసారు చంద్రశేఖర్. 'అమ్మాయి నచ్చింది' అన్నట్లు నవ్వుతూ చిన్నగా తలూపింది పార్వతి.

"చూడండి బావగారూ! మా యిద్దరికీ మీ అమ్మాయి సాహిత్య నచ్చింది. మీరు పంపించిన ఫొటో అబ్బాయికి నచ్చింది. ఈ పెళ్ళికి మావైపు నుంచి ఏ అభ్యంతరం లేదు. మా అబ్బాయి గురించి ప్రత్యేకంగా మీకు చెప్పక్కరలేదు. ప్రస్తుతం తెలుగులో పేరున్న మంచి రైటర్. అది మీకు తెలుసు. ఇక వుద్యోగం విషయానికి వస్తే టాటా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తు న్నాడు. మాకున్నది ఒక్కగానొక్క కొడుకు. నేను సంపాదించినదీ, మా వాడు సంపాదాదించినదీ చాలావుంది. కాబట్టి మాకు నయాపైసా కట్నం అవ సరం లేదు. పెళ్ళి ఖర్చు కూడా మేం సగం పెట్టు కుంటాం. మీరేమంటారు."

ఆడపెళ్ళివారి కళ్లలో ఆనందాల హరివిల్లు విరబూసింది. ఇంత మంచి సంబంధం వెతుక్కుంటూ తమ యింటికి వచ్చి నందుకు వారి ఆనందానికి హద్దులేదు.

చంద్రశేఖర్ "సాహిత్యా నీ అభిప్రాయం ఏమిటమ్మా?" అని అడిగారు.


'ఇష్టమే' అన్నట్లు తలూపింది సాహిత్య.

"ఏమిటీ మా అబ్బాయిని చూడకుండా, మాట్లాడకుం డానే నచ్చాడని ఎలా చెబుతున్నావు" కుతూహలంగా అడి గారు.సాహిత్య చిన్నగా నవ్వుతూ "ఆయన రచనలన్నీ ఇంచు మించు చదివినదాన్ని. స్త్రీల అభ్యుదయం కోసం, వారి సంక్షేమం కోసం ఎన్నో మంచి మార్గాలు సూచించారు. అవన్నీ ఆయన మనస్తత్వానికి ప్రతిబింబాలు కావా? మీలాంటి వున్నత భావాలు కలిగిన తల్లిదండ్రుల నీడలో పెరిగిన వారి సంస్కారం గురించి ప్రత్యేకంగా తెలుసుకోవలసింది ఏముం దండీ. అయినా నా మంచి చెడ్డల గురించి నాకన్నా మా అమ్మానాన్నలకే బాగా తెలుసు. వారందరికీ యిష్టమైతే నాకూ యిష్టమే" అంది.

* * *

"నాతో మాట మాత్రమైనా చెప్పకుండా నాకు ఈ పెళ్ళి యిష్టమే అని చెప్పారు డాడీ. అంటే మీ వుద్దేశం ఏమిటి? మీ యిద్దరికీ యిష్టం అయితే నేను గంగిరెద్దులా పీటల మీద కూర్చోవాలా" విసురుగా చేతిలో పుస్తకాన్ని టీపాయ్ మీద విసిరేసి ఒక్కుదుటన సోఫాలోంచి లేచి నిలబడ్డాడు మధు.

"అదేంట్రా మధూ డాడీ మీద అలా విరుచుకుపడుతు న్నావు? సాహిత్య అచ్చు బంగారం బొమ్మలా వుందిరా. తెలు గులో ఎమ్.ఏ చేసింది. పైగా లెక్చరర్‌గా వుద్యోగం చేస్తున్నా



ఎంత అణకువగా వుందీ. అయినా ఫొటో చూసి అమ్మాయి నచ్చింది, మిగతా విషయాలు మాట్లాడండి అని నువ్వే కదరా చెప్పావు"

"అవును చెప్పాను మమ్మీ. కానీ మీరేం చేసారు? అన్ని విషయాలూ మాట్లాడి రమ్మంటే మాకు కాణీ కట్నం వద్దు. మా దగ్గర లక్షలు లక్షలు మూలుగుతున్నాయి. పైగా పెళ్ళి ఖర్చులు కూడా మేమే పెట్టుకుంటాం. అమ్మాయిని కట్టుబ ట్టల్తో పంపిస్తే చాలు, మేమే జీవితాంతం పోషిస్తాం అని చెప్పి మరీ వచ్చారు"

ఎప్పుడూ లేనిది కొడుకు ఇలా ఎదిరించి మాట్లాడు తుంటే చంద్రశేఖర్, పార్వతి మాటలు రానట్లు చూస్తూ నిల బడిపోయారు.

"నాతో పని చేస్తున్నవారంతా కట్నం తీసుకుంటుంటే, నేనేమో వెధవ సన్నాసిలా, ఎందుకూ పనికిరాని వాడిలాగా 'ఫ్రీ'గా చేసుకోవాలా? అమ్మాయి బంగారం బొమ్మ. అయితే ఏంటి వెండి బొమ్మ అయితే ఏంటి? నా భార్యని షోకేస్‌లో పెట్టి అందరికీ చూపించాలా? అయినా నాలాంటి రైటర్ని చేసుకోవడానికి అమ్మాయిల తల్లిదం డ్రులు లక్షలు చేత్తో పట్టుకుని నా యింటి ముందు క్యూలో నిలబడతారు. ఈ దిక్కు మాలిన సంబంధం చేసుకోవలసినవ అవ సరం నాకు లేదు"

'తాము నేర్పించిన సంస్కారం ఇదేనా?' అని యిద్దరూ విభ్రాంతిగా చూస్తున్నారు.

పార్వతి ఏడుపు గొంతుతో "అదేంట్రా అలా అంటావు. స్త్రీ సంక్షేమమే నీ ధ్యేయం అన్నట్లు కథలు, నవలలు రాసావు కదా? ఆ ఆదర్శం నీ నిజ జీవితంలో ఏమైందిరా? మనకు సరి పోయేటంత డబ్బుంది. ఆస్తులున్నాయి. ఇంకా ఎందుకురా నీకు తాపత్రయం? ఆ అమ్మాయి తండ్రి స్కూల్ టీచర్. పిల్ల లకి మంచి చదువులైతే చెప్పించారుగానీ లక్షల కట్నం ఎక్కడ నుంచి తెస్తారు? కాస్త ఆలోచించరా?"

బాధతో పార్వతి కంఠం వణుకుతోంది.

మధు వెటకారంగా నవ్వుతూ "అమ్మా! కథలు వేరు జీవితం వేరు. పేరు కోసం ఏవేవో రాస్తూంటాం. అవన్నీ పాటించాలని రూలేమీ లేదు కదా! కథలో హీరో జాలితో గుడ్డిపిల్లకి తాళి కట్టాడని రాస్తాను. అలా అని నేను కూడా గుడ్డిదాన్ని చేసుకోవాలా? ఈమధ్య నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చిన కథలో హీరో విధవ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. అలా రాసాను కదా అని అలాంటి పెళ్ళి నేను చేసుకోలేను కదా! ఆదర్శాలు రాయడానికి, చదవడానికే బాగుంటాయి. మనం కూడా వాటిని అక్కడే మరచిపోవాలి. ఈ అనవసరపు వాదనలెందుకు? నాకీ పెళ్ళి యిష్టం లేదు. మాకు మీ సంబంధం నచ్చలేదని యిప్పుడే లెటర్ రాసి పడేయండి" విసురుగా వెళ్ళిపోయాడు.

మొదటిసారిగా కొడుకులో తాము ఇంతవరకు చూడని కొత్త కోణాన్ని చూస్తున్నారు చంద్రశేఖర్, పార్వతి.

* * *

"గౌరవనీయులైన రఘునాధరావుగారికి,

నేను మీకు ఇలా లెటర్ రాయాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. 'బావగారూ' అని పిలవాల్సిన నోటితో మీ పేరు పెట్టి పిలవాల్సి వస్తున్నది. మీ అమ్మాయి చదువుల సరస్వతి. మంచి సంస్కారవంతురాలు. అమ్మాయి ఏ యింట్లో అడుగుపెట్టినా ఆ యిల్లు స్వర్గం అవుతుంది. కానీ మాకా అదృష్టం లేదు.

ఆదర్శం అనేది మాటల్లో కాదు, చేతల్లో వుండాలి. ఆ విష యంలో మా అబ్బాయి మేడిపండులాంటి వాడు. శారీరకంగా అంగవైకల్యం వున్నవారిని ప్రేమతో అక్కున చేర్చుకోవచ్చు. కానీ మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని నమ్ము తున్న మావాడి మానసిక వైకల్యానికి ఏ మందూ లేదు. మీ అమ్మాయికి మా అబ్బాయి సరియైన జోడీకాదు. నా కొడుకు లాంటి మానసికరోగికి మీ అమ్మాయినివ్వకండి. క్షమించమని అడిగే అర్హత కూడా లేని చంద్రశేఖర్"

ఉత్తరం పూర్తి చేసి భార్య చేతికిచ్చాడు చంద్రశేఖర్.

-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)